


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 33 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు మంగళవారం 8 అక్టోబర్ 2024 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 33 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE TUE 8 OCTOBER 2024 PRICE : 5/- RS
Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ

- ఢిల్లీలో పర్యటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు
- మోదీతో సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాల ప్రస్తావన
- రైల్వే శాఖ మంత్రి అశ్విని వైషవ్ తోనూ సమావేశమైన చంద్రబాబు
- నేడు పలువురు కేంద్రమంత్రులతో భేటీ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన కొనసాగుతోం ది. ఈ సాయంత్రం ఆయన ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. మోదీతో సమావేశంలో చంద్రబాబు రాష్ట్రానికి చెందిన అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రధానితో సమావేశం దాదాపు గంటపాటు సాగింది. రాష్ట్రంలో వరద నష్టం, పోలవరం ప్రాజెక్టు, డయాఫ్రం వాల్ కు నిధులు, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, తాజా రాజకీయ పరిణామాల గురించి చంద్రబాబు ప్రధాని మోదీతో చర్చించారు. వరదలతో నష్టపోయిన ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు వీలుగా మరిన్ని నిధులు ఇవ్వాలని మోదీని కోరారు. చంద్రబాబు తన ఢిల్లీ పర్యటన సందర్భంగా రైల్వే శాఖ మంత్రి అశ్విని వైషవ్ ను కూడా కలిశారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు పురోగతిపై చర్చించారు. రాష్ట్ర రాజధాని అమరావతికి అనుసంధానమయ్యే రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించారు. పోర్టుల అభివ ృద్ధి, అనుసంధానం తదితర అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు కూడా పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు నితిన్ గడ్కరీని కలవనున్నారు. ఇతర కేంద్రమంత్రులు పియూష్ గోయల్, హర్ దీప్ సింగ్ పురిని కూడా చంద్రబాబు కలవనున్నారు.

## మహిళ హత్య కేసులో మాజీ ఎంపీ నందిగం సురేశ్ కు 14 రోజుల రిమాండ్

- వైసీపీ నేత నందిగం సురేశ్ కు మరిన్ని చిక్కులు
- 2020లో వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్య
- ఈ కేసులో నందిగం సురేశ్ ను కోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- ఈ నెల 21 వరకు రిమాండ్ విధించిన మంగళగిరి కోర్టు



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ మాజీ ఎంపీ నం దిగం సురేశ్ మరిన్ని చిక్కుల్లో పడ్డారు. ఇప్ప టికే టీడీపీ కార్యాల యంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న నందిగం సురేశ్... వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్య కేసును కూడా ఎదుర్కొంటున్నారు. తాజాగా, ఈ మహిళ హత్య కేసులో నందిగం సురేశ్ ను పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు

వివరాలు 2లో..

## బొగ్గుగనిలో భారీ పేలుడు.. ఏడుగురు మృతి



**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సోమవారం ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. బీర్‌భూమ్ జిల్లాలోని ఓ బొగ్గు గని భారీ పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సహాయక చర్యలు అందించడానికి బయలుదేరారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బీర్‌భూమ్‌లోని లోక్‌పూర్ ప్రాంతంలో ఉన్న గంగారామ్‌చక్ మైనింగ్ ప్రైవేట్ కొలీరీలో ఈ ఘటన చోటు చేసుకుంది.

వివరాలు 2లో..

## తిరుమలలో గరుడ సేవకు విస్తృత ఏర్పాట్లు చేశాం

### ఈవో శ్యామలరావు

- తిరుమలలో వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- నేడు గరుడ సేవ
- లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా



**పెన్ పవర్ డెస్క్:**తిరుమల వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఘట్టం గరుడ సేవ. ఎంతో ప్రాశస్త్యం కలిగిన గరుడ సేవను ప్రత్యక్షంగా చూసి తరించేందుకు లక్షలాదిగా భక్తులు తిరుమల తరలివస్తారు. ప్రస్తుతం తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. (అక్టోబరు 8) గరుడ సేవ నిర్వహించనున్నారు.

వివరాలు 2లో..

## టీడీపీలోకి తీగల కృష్ణారెడ్డి

- చంద్రబాబును కలిసిన తీగల కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు
- ఏపీ సీఎంను తన మనవరాలి పెళ్లికి ఆహ్వానించనున్న మల్లారెడ్డి
- ఈ భేటీ అనంతరం టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించిన తీగల కృష్ణారెడ్డి



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే తీగల క ృష్ణారెడ్డి భేటీ అయ్యారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం క ృష్ణారావు, తీగల

వివరాలు 2లో..

## విశాఖ హనీట్రాప్ కేసులో పోలీసుల దూకుడు

- అందమైన యువతుల ఫొటోలతో యువకులకు వల
- సామాజిక మాధ్యమాల ద్వారా వారిని తమ ఉచ్చులో చిక్కుకునేలా ప్లాన్
- బాధితులకు డ్రగ్స్ ఇచ్చి, యువతులు వారితో సన్నిహితంగా ఉన్నట్లు ఫొటోలు తీసిన వైనం
- ఆ తర్వాత వాటితో బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు వసూలు



వివరాలు 2లో..

## పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తాం



**పెన్ పవర్ డెస్క్:**యువగళం పాదయాత్రలో తాను ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఎటువంటి ఆదాయం లేని ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు ఇబ్బందిగా ఉందని బ్రాహ్మణులు పాదయాత్ర సందర్భంగా తన ద ృష్టికి తెచ్చారని, వారికి ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం ధూప, దీప నైవేద్య సాయం తాజాగా రూ.10 వేలకు పెంచడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. దాంతో రాష్ట్రంలోని 5,400 చిన్న ఆలయాల్లో ఎటువంటి ఆటంకం లేకుండా భగవంతుడి సేవకు

వివరాలు 2లో..

## మరోసారి ఎంజీఆర్ గురించి ట్వీట్ చేసిన పవన్ కల్యాణ్

- పవన్, ప్రకాశ్ రాజ్ మధ్య మాటల యుద్ధం
- ఇటీవల ఎంజీఆర్ గురించి ట్వీట్ చేసిన పవన్
- హఠాత్తుగా ఎందుకింత ప్రేమ పుట్టుకొచ్చిందో అంటూ ప్రకాశ్ రాజ్ ట్వీట్
- తాజా ట్వీట్ తో కౌంటర్ ఇచ్చిన పవన్!



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ మధ్య ట్వీట్ల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. తిరుపతి లడ్డూ కల్తీ, సనాతన ధర్మం అంశంలో ఇరువురి మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఇటీవల పవన్ కల్యాణ్ ఎంజీఆర్, అన్నాడీఎంకే గురించి ట్వీట్ చేయగా.... ఎంజీఆర్ పై హఠాత్తుగా ఎందుకింత ప్రేమో, పైనుంచి ఆదేశాలు అందాయా అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శనాత్మకంగా స్పందించారు. ఈ క్రమంలో, పవన్ కల్యాణ్ మరోసారి ఎంజీఆర్ గురించి ట్వీట్ చేశారు. పురచ్చి తలైవర్, శ్రీ ఎంజీఆర్ నుంచి పాఠాలు నేర్చుకున్నానని పవన్ వెల్లడించారు.

వివరాలు 2లో..

## అభియోగాలపై వివరణ ఇవ్వండి...

### సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ ను ఆదేశించిన ప్రభుత్వం

- సోషల్ మీడియాలో రఘురామపై సునీల్ కుమార్ వ్యాఖ్యలు
- నగరంపాలెం పీఎస్ లో రఘురామ ఫిర్యాదు
- 15 రోజుల్లోపు వివరణ ఇవ్వాలంటూ సునీల్ కుమార్ కు ఉత్తర్వులు



**పెన్ పవర్ డెస్క్:**టీడీపీ ఉండి ఎమ్మెల్యే రఘురా మకృష్ణరాజు వ్యవహారంలో మాజీ సీఐడీ చీఫ్ సునీల్ కుమార్ పై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. నగరంపాలెం పీఎస్ లో దాఖలైన ఫిర్యాదుకు సంబంధించిన అభియోగాలపై 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని జీఏడీ రాజకీయ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాలు 2లో..

## ఇదేం ఇసుక పాలసీ?

- కూటమి ప్రభుత్వం ఇసుక విధానంపై బొత్స విమర్శలు
- ఇసుక పాలసీలో స్పష్టత లేదని వ్యాఖ్యలు
- కూటమి పార్టీ నేతలు యధేచ్ఛగా ఇసుక దోచుకుంటున్నారని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**కూటమి ప్రభు త్వం తీసుకువచ్చి న ఇసుక విధా నంలో స్పష్టత లేదంటూ వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పెదవి విరిచారు. ఇసుక పాలసీ లో పారదర్శకత లోపించిందని విమర్శించారు. నాలుగు నెలలవుతున్నా, ఇసుకపై సరైన విధానమంటూ లేదని అసంత ృప్తి వ్యక్తం చేశారు. ఓవైపు ఉచిత ఇసుక అని ప్రచారం చేసుకుంటూనే, మరోవైపు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి

వివరాలు 2లో..

## వైద్యశాస్త్రంలో నోబెల్ ప్రైజ్ ప్రకటన.. ఇద్దరిని వరించిన ప్రతిష్టాత్మక అవార్డ్



**పెన్ పవర్ డెస్క్:**2024 సంవత్సరానికిగానూ మెడిసన్ విభాగంలో నోబెల్ అవార్డు విజేతల పేర్లను స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ మెడికల్ యూనివర్శిటీ ప్రకటించింది. జన్యు నియంత్రణలో మైక్రో ఆర్ఎన్ఏ పాత్రపై చేసిన పరిశోధనలకుగానూ అమెరికన్ శాస్త్రవేత్తలు విక్టర్ అంబ్రోస్, గ్యారీ రువ్‌కున్ వైద్యశాస్త్రంలో సంయుక్తంగా నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. ఈ మేరకు నోబెల్ కమిటీ ఇవాళ ( 2024, అక్టోబర్ 7) ప్రకటన చేసింది. వైద్యశాస్త్రంలో నోబెల్ ప్రైజ్‌కు ఎంపికైన విక్టర్ అంబ్రోస్, గ్యారీ రువ్‌కున్ 1.1 మిలియన్ డాలర్ల నగదు పురస్కారం అందుకోనున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా ఆనవాయితీ ప్రకారం మెడిసిన్ విభాగానికి సంబంధించిన విజేతల పేర్లనే నోబెల్ సెలక్షన్ మొదటి ప్రకటించింది. తర్వాత సైన్స్, సాహిత్యం, ఆర్థిక, శాంతి రంగాలకు సంబంధించి విజేతల పేర్లను

వివరాలు 2లో..

## హింసతో ఏదీ సాధించలేం

### కేంద్ర హెూం మంత్రి అమిత్ షా



- జనజీవన స్రవంతిలో కలవండి
- రాష్ట్రాల పోలీసుల విభాగాలు బాగా పనిచేస్తున్నయ్
- కేంద్ర హెూం మంత్రి అమిత్ షా
- మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంలతో భేటీ

**పెన్ పవర్ డెస్క్:** పోలీస్ శాఖ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర బాగా పనిచేశాయని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంలతో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఇవాళ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ఛత్తీస్ గఢ్ లో వామపక్ష ఉగ్రవాదంపై పై చేయి సాధించామని అన్నారు. మావోయిస్టులు హింసతో

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

# చివరి దశకు చేరుకున్న నక్సల్స్ పోరాట బరి

ఆధునిక సమాజంలో సమస్యల రూపం సమూలంగా మారిపోయింది. కానీ, అడవుల్లో ఉన్న ఉద్యమ నాయకులు మాత్రం గత భూస్వామ్య, పెట్టుబడీదారి భావజాలంలోనే కొనసాగుతున్నారు. గ్లోబలైజేషన్ అడవులకు చేరుకుంటున్న తరుణంలో.. అడవుల్లో గిరిజనులే లేకుండా పోతున్నారు. నక్సలైట్లుగా మారే వాళ్లు తక్కువవుతుంటే.. ఉన్నవారికి లొంగుబాట్లు, కుంగుబాట్లే మిగిలాయి. మహిళల్నీ, బాలికల్ని రిక్రూట్ చేసుకుంటున్న పరిస్థితులు పెరిగాయి. దాదాపు రెండు దశాబ్ధాల నుండి నడుస్తున్న ఈ సంక్షోభం ఇప్పుడు పీక్స్‌కు చేరుకుంది. ఉద్యమం నీరుగారిపోయి, మావోయిజం మసకబారుతోందిదాదాపు ఐదు దశాబ్దాల తర్వాత, అనేక ఒడిదుడుకులను తట్టుకుని నిలబడిన మావోయిస్ట్ ఉద్యమం ఇప్పుడు దాని చివరి దశను చేరుకుంటుంది. ఎన్‌కౌంటర్ ఘటనలు, లొంగిపోతున్న మావోయిస్ట్‌లు, అరెస్టవుతున్న మావోయిస్టుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ నక్సలైట్లు తగ్గిపోతున్నారు. ఒకప్పుడు ఎదురు కాల్పులు జరిగితే భద్రతా దళాలకు కూడా నష్టం వాటిల్లేది. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. పదులు సంఖ్యలో నక్సలైట్లు రాలిపోతున్నారు. భద్రతా దళాల దాడుల్లో ఆధునిక పరికరాలు వాడుతున్నారు. ఒకవైపు, నక్సలైట్లకు టెక్నాలజీ దూరమవుతుంటే.. భద్రతా బలగాలకు సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. అడువులు తగ్గుతున్న కొద్దీ మావోయిస్ట్‌లకు స్థావరాలు తగ్గుతూ వస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, పర్యాటకం పేరుతో కారడువుల్లోనూ కాటేజ్‌లు వస్తున్నాయి. మరోవైపు, రాను రానూ నక్సలైట్ల సంఖ్య తగ్గుతుంటే ఉద్యమంలో 1990ల మధ్యకాలం నుండి కొత్త రిక్రూట్‌మెంట్లు జరగట్లేదు. మావోయిస్టు భావజాలానికి ప్రత్యేకించి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలోని విద్యార్థులలో ఎవరూ లేరు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో 2004లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ నిషేధం తర్వాత రిక్రూట్‌మెంట్లపై పెద్ద దెబ్బ పడింది. ఒక విధంగా, ఉద్యమంలో చేరడానికి మనుషులే కరువయ్యారు.ఒకప్పుడు బాగా చదువుకున్న మేథావులు కూడా ఉద్యమంలో భాగస్థులు అయ్యేవారు. పెత్తందారీ పాలనకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమం వ్యూహాత్మకంగా బలంగా ఉండేది. అయితే, రాను రానూ ఉద్యమంలో సభ్యుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. ఏ పెట్టుబడీదారి, గ్లోబలైజేషన్‌కు వ్యతిరేకంగా మావోయిస్ట్‌లు పోరాటం చేశారో.. అదే, గ్లోబలైజేషన్ అభివృద్ధి పేరుతో వచ్చి, పేదలకు సైతం వృత్తి ఉద్యోగావకాశాలను పెంచింది. రానురానూ రోడ్డు రవాణా మెరుగువుతోంది. అసలు, ఏ అడవి బిడ్డల కోసం నక్సలైట్లు పోరాటం మొదలుపెట్టారో ఆ అడవుల్లో జీవించేవారే తక్కువయ్యారు.చదువుకుంటున్న ఆదివాసీ యువతంతా వృత్తి విద్యల కోసం నగరాల బాట పట్టారు. నిరక్షరాస్యులు, అవకాశాలకు దూరమైన వారు తప్ప అడవుల్లో నివశించే వారే తక్కువయ్యారు. దీనితో, ఉద్యమంలో నుండి వెళ్లిపోయేవారే తప్ప కొత్తగా వచ్చేవారు లేరు. దీనితో, అత్యంత వెనుకబడిన ప్రాంతాల నుండి బలవంతంగా యువతను లాక్కుంటున్న పరిస్థితి వచ్చింది. వారికి సరైన శాస్త్రీయ పరిజ్ఞానం లేకపోవడంతో సంఖ్యా బలం తప్ప బుద్ధి బలం లోపించిన పరిస్థితులు వచ్చాయి. ఒకొక్కరిగా సీనియర్ లీడర్లంతా కనుమరుగవుతుంటే.. ఉన్నవారితోనే ఉద్యమాన్ని నడిపాల్సి అవసరం వచ్చింది. డాక్టర్లు, ఇంజినీర్లు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు కనుమరుగయ్యి.. గన్ను పట్టుకోవడం వచ్చినవారే ఎక్కువయ్యారు. ప్రభుత్వం పోలీసింగ్ పెరిగే కొద్దీ, అడవుల్లో మావోయిస్ట్ పొటన్సీ తగ్గుతూ వచ్చింది. 2011లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ రూపొందించిన ఒక నివేదికలో.. ఈ ప్రాంతంలో ఉద్యమం స్తబ్దత స్థాయికి చేరుకుందని పేర్కొంది. దీనిని, 2013-14లో సెంట్రల్ కమిటీ కూడా ఆమోదించింది. 2014లో, అప్పటి సిపిఐ-మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి.. అన్ని రాష్ట్ర కమిటీలకు రాసిన లేఖలో కీలకమైన వ్యాఖ్యలు చేశారు. నష్టాలను తగ్గించండనీ, బలమైన కోటలను రక్షించండని అందులో ఉత్తర్వు ఇచ్చారు. ఈ పరిణామం, మావోయిస్ట్ ఉద్యమ తిరోగమనాన్ని సూచిస్తుంది. అప్పటికే, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి చాలా రాష్ట్రాల్లో గ్రేహౌండ్స్, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ వంటి నక్సల్ వ్యతిరేక పోరాట దళాలు వచ్చేశాయి. ఇది కీకారణ్యంలోకి కూడా చొరబడి, అగ్ర నాయకులను చంపేశాయి. అప్పటి నుంచి మావోయిస్టుల కార్యకలాపాల పరిధి తగ్గుతూ వస్తోంది. అది ఆంధ్రా ఒడిశా బోర్డర్‌లో, లేదంటే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్‌లలో ఉంటుంది. గతంలో ఈ ప్రాంతాల్లో మావోయిస్ట్‌లు మాత్రమే పరిష్కరించే సమస్యలను ఇప్పుడు తర్వాతి తరంలోని మధ్యతరగతి నాయకత్వంలో గిరిజన ప్రజలు బలంగా మారారు. మైదాన ప్రాంతాల ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్థాయికి వచ్చారు. ఇలాంటి పరిస్థితుల మధ్య ఒకప్పుడు పదులు సంఖ్యలో ఉన్న కేంద్ర కమిటీ బలం ఇప్పుడు వేళ్లపై లెక్కపెట్టే స్థాయికి వచ్చింది. ఇందులో కూడా దాదాపు 60 ఏళ్లు పైబడిన నాయకులే ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది వివిధ వ్యాధులతో బాధపడుతున్నారు. వారిలో కూడా దాదాపు 70% మంది ఏపీ, తెలంగాణకు చెందిన వారు. వీరిలో చాలా మంది చనిపోయారు కూడా. మధ్య స్థాయి నాయకత్వం కూడా బలంగా లేదు. ఏది ఏమైనప్పటికీ, మావోయిస్ట్ ఉద్యమానికి కాలం చెల్లింది. నానాటికీ పెరుగుతున్న లొంగుబాట్లతో శాంతి చర్చలు చేసే పరిస్థితి కూడా లేదు. ఇక, పోరాటం అంటారా.. దాని రూపం మార్చుకొని చాలా కాలం అయ్యింది. బూటకమైనా, నాటకమైనా అది ప్రజాస్వామ్య బద్ధంగానే జరుగుతుందనే రాజకీయం పెరిగింది. అందులో నుండి సమస్యలను పరిష్కరించాలి తప్ప అడవుల్లో ఇక స్థానం లేదన్నది స్పష్టంగా కనిపిస్తుంది.

# హింసతో ఏదీ సాధించలేం

- మొదటి పేజీ తరువాయి

ఏదీ సాధించలేరని.. అందుకే జనజీవన ప్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. బహుముఖ వ్యూహాలను అమలుచేస్తూ.. మావోయిస్టు సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని అన్నారు. ఈ అంశంలో ఆయా రాష్ట్రాల పోలీస్ విభాగాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా 2026 నాటికి నక్సలిజం అంతం, అర్బన్ నక్సల్ అంశాలపై ప్రధానంగా చర్చించారు. దేశంలో మావోయిస్టు సమస్య లేకుండా చేయడమే ప్రస్తుత లక్ష్యమని.. అందుకోసం తదుపరి కార్యచరణ, రాష్ట్రాల భాగస్వామ్యంపై మాట్లాడారు. "వికసిత్ భారత్ సాధించాలంటే అందులో మన ట్రైబల్ ప్రజలు కూడా భాగం కావాలి. కానీ ప్రభుత్వ ఫలాలు వారికి చేరకుండా మావోయిస్టులు అడ్డుకుంటున్నారు. రోడ్లు, టవర్లు, చివరకు విద్య, వైద్యం కూడా గిరిజన ఆదివాసీలకు చేరనీయడం లేదు. గత కొన్నేళ్లలో మావోయిస్టు సమస్యను ఎదుర్కొనే విషయంలో గణనీయమైన పురోగతి సాధించాం. మావోయిస్టుల ప్రభావిత గిరిజన ఆదివాసీ ప్రాంతాలకు ప్రభుత్వ ఫలాలు, పథకాలు కూడా వేగంగా చేరుతున్నాయి. బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తూ ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాం. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల పోలీస్ విభాగాలు కూడా చాలా బాగా పనిచేస్తున్నాయి" అని అమిత్ షా కొనియాడారు.

# టీడీపీలోకి తీగల కృష్ణారెడ్డి

- మొదటి పేజీ తరువాయి

కృష్ణారెడ్డి జూబ్లీహిల్స్ లోని చంద్రబాబు నివాసంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి కీలక ప్రకటన చేశారు. తాను టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్‌తో తన రాజకీయ ప్రస్థానం మొదలైందని గుర్తు చేసిన ఆయన... హైదరాబాద్ అభివృద్ధి చేసింది వందకు వందశాతం చంద్రబాబేనని అన్నారు. తెలంగాణలో టీడీపీ పాలన మళ్లీ రావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఇక చంద్రబాబును కలిసిన మల్లారెడ్డి తన మనవరాలు శ్రేయరెడ్డి పెళ్లికి సీఎంను ఆహ్వానించారు. గతంలో మల్లారెడ్డి, మాధవరం కృష్ణా రావు, తీగల కృష్ణా రెడ్డి టీడీపీలో పనిచేసిన విషయం తెలిసిందే. కానీ, ఆ తర్వాత జరిగిన పరిణామాలతో టీడీపీని వీడారు. మల్లారెడ్డి మనవరాలు పెళ్లి కారణంగా చాలా కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు టీడీపీ అధినేతను కలిశారు.

# వైద్యశాస్త్రంలో నోబెల్ ప్రైజ్ ప్రకటన.. ఇద్దరిని వరించిన ప్రతిష్టాత్మక అవార్డ్

- మొదటి పేజీ తరువాయి

అనౌన్స్ చేయనున్నారు. అక్టోబర్ 14వ తేదీ వరకు అవార్డుల ప్రకటన కొనసాగనుంది. స్వీడిష్ కు చెందిన శాస్త్రవేత్త, వ్యాపారవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా 1901 నుండి ప్రతి సంవత్సరం నోబెల్ అవార్డులను ప్రధానం చేస్తోన్న విషయం తెలిందే ప్రపంచవ్యాప్తంగా వైద్యం, సైన్స్, సాహిత్యం, శాంతి రంగాల్లో విశేషంగా కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు నోబెల్ అవార్డులు ఇస్తున్నారు. తర్వాత ఆర్థిక రంగంలో కూడా ఈ అవార్డ్‌ను అందజేస్తున్నారు. ప్రస్తుతం మొత్తం ఐదు రంగాల్లో నోబెల్ అవార్డులను ప్రధానం చేస్తున్నారు. డిసెంబర్ 10 ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా స్టాక్‌హోమ్‌లో విజేతలకు అవార్డులను ప్రధానం చేస్తారు. అయితే శాంతి రంగానికి చెందిన అవార్డ్‌ను మాత్రం స్టాక్ హోమ్‌లో కాకుండా ఓస్లోలో విజేతకు అందజేస్తారు.

# తిరుమలలో గరుడ సేవకు విస్తృత ఏర్పాట్లు చేశాం

- మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తోందని ఈవో జె.శ్యామలరావు వెల్లడించారు. గరుడ సేవను వీక్షించేందుకు దాదాపు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. రద్దీ దృష్ట్యా, తిరుమలకు ఎక్కువ వాహనాలు వచ్చే వీల్లేదని స్పష్టం చేశారు. ఈ మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎల్లుండి ఉదయం 9 గంటల వరకు ఘాట్ రోడ్డులో ప్రైవేటు ట్యాక్సీలకు అనుమతి లేదని చెప్పారు. ఈ రాత్రి 9 గంటల నుంచి ఎల్లుండి ఉదయం 9 గంటల వరకు ఘాట్ రోడ్డులో ద్విచక్రవాహనాలకు అనుమతి లేదని అన్నారు. గరుడ సేవకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ 400కి పైగా బస్సులు అందుబాటులోకి తీసుకుస్తోందని, 3 వేల ట్రిప్పులు నడిపేందుకు ఏర్పాట్లు చేసిందని వివరించారు.

భక్తుల సౌకర్యార్థం తిరుమలలోని ముఖ్య కూడళ్లలో అన్నప్రసాదం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. భద్రతకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఈవో చెప్పారు. భద్రతా ఏర్పాట్ల కోసం 1,200 మంది విజిలెన్స్ సిబ్బంది... 3,800 మంది పోలీసులు పనిచేస్తున్నారని తెలిపారు. కేవలం గరుడ సేవ వద్ద 1,500 మంది పోలీసులు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని వివరించారు.

తిరుమల క్షేత్రంలో భక్తులకు సమాచారం అందించేందుకు ముఖ్యమైన కూడళ్ల వద్ద డిస్ ప్లే బోర్డులు ఏర్పాటు చేసినట్టు ఈవో శ్యామలరావు చెప్పారు. శ్రీవారి భక్తులు సంతృప్తికరంగా గరుడసేవను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. తిరు మాడ వీధుల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని, వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఇక, తిరుమలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# విశాఖ హనీట్రాప్ కేసులో పోలీసుల దూకుడు

**పెన్ పవర్ డెస్క్:** విశాఖపట్నం హనీట్రాప్ కేసులో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించే క్రమంలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. దాంతో ఈ కేసును లోతుగా విచారిస్తున్నారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే వెంటనే తమను సంప్రదించాలని పోలీసులు కోరారు. హైదరాబాద్ కేంద్రంగా ఓ ముఠా ఈ వ్యవహారాన్ని నడిపినట్లు పోలీసులు గుర్తించారు. అందమైన యువతుల ఫొటోలతో యువకులను ఆకర్షించి, సామాజిక మాధ్యమాల ద్వారా వారిని తమ ఉచ్చులో చిక్కుకునేలా చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితులకు మాదక ద్రవ్యాలు ఇచ్చి, వారు మత్తులోకి జారుకున్న తర్వాత యువతులు సన్నిహితంగా ఉన్నట్లు ఫొటోలు తీసేవారు. అంతే.. ఆ తర్వాత ఆ ఫొటోలను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేయడం చేశారు. తద్వారా వారి నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేశారు. తమ ప్రైవేట్ ఫొటోలు బయటకు వస్తే పరువుపోతుందన్న భయంతో బాధితులు ఆన్‌లైన్ ద్వారా భారీగా డబ్బులు సమర్పించుకున్నారు. ఈ వ్యవహారంలో చాలా మంది యువకులు చిక్కుకున్న పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో నిందితుల ఆన్‌లైన్ లావాదేవీలపై పోలీసులు నిఘా పెట్టారు. వారి నగదు లావాదేవీలపై ఆరా తీస్తున్నారు. త్వరలోనే ఈ కేసును ఒక కొలిక్కి తీసుకువస్తామని పోలీసులు వెల్లడించారు. నిందితులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# మహిళ హత్య కేసులో మాజీ ఎంపీ నందిగం సురేశ్ కు 14 రోజుల రిమాండ్

- మొదటి పేజీ తరువాయి

సురేశ్ కు అక్టోబరు 21 వరకు రిమాండ్ విధించింది.

టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో అరెస్టయి గుంటూరు జైల్లో ఉన్న నందిగం సురేశ్ ను... పోలీసులు తాజాగా మహిళ హత్య కేసులో అరెస్ట్ చేశారు. 2020లో తుళ్లూరు మండలం వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్యకు గురైంది. ఈ హత్య కేసుకు సంబంధించి ఇటీవల పోలీసులు పీటీ వారెంట్ కోరగా... కోర్టు అనుమతి ఇచ్చింది.

# పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఆస్కారం ఏర్పడిందని తెలిపారు. అందరి క్షేమం కోరే మనసున్న మంచి ప్రభుత్వం తమదని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# ఇదేం ఇసుక పాలసీ?

- మొదటి పేజీ తరువాయి

పార్టీల నేతలు మాత్రం ఇసుకను యధేఛగా దోచుకుంటున్నారని బొత్స ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 117 రోజులు గడుస్తున్నా, భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేవని, ఇసుకపై ఆధారపడిన వారంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

# అభియోగాలపై వివరణ ఇవ్వండి...

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ప్రభుత్వం జీవో నెం.1695 తీసుకువచ్చింది. అభియోగాలపై వివరణ ఇచ్చే క్రమంలో, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు తీసుకువచ్చే ప్రయత్నం చేసినా పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. సునీల్ కుమార్ తన వివరణను లిఖితపూర్వకంగా ఇవ్వాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# మరోసారి ఎంజీఆర్ గురించి ట్వీట్ చేసిన పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు తాను గతంలో ఎంజీఆర్ గురించి చేసిన కామెంట్ల తాలూకు వీడియోలను పంచుకున్నారు.

ఎంజీఆర్ పై హఠాత్తుగా ఎందుకింత ప్రేమ పుట్టుకొచ్చిందో అని ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గానే పవన్ తాజా ట్వీట్ చేసినట్టు నెటిజన్లు భావిస్తున్నారు. ఇప్పుడే కాదు, గతంలోనే ఎంజీఆర్ గురించి మాట్లాడానని చెప్పడమే పవన్ ఉద్దేశమని పలువురు నెటిజన్లు అభిప్రాయపడ్డారు.

# బొగ్గుగనిలో భారీ పేలుడు.. ఏడుగురు మృతి

- మొదటి పేజీ తరువాయి

పేలుడు ప్రభావానికి సమీపంలో పార్క్ చేసిన వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. గంగారామ్‌చక్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కొలీరీలో బొగ్గు వెలికితీత కోసం పేలుడు చేస్తుండగా ఈ ఘటన జరిగింది. గనిలో పేలుడు తర్వాత అధికారులు, కార్మికులు సురక్షిత ప్రాంతానికి పరుగులు తీశారు.

# ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ బిజీ.. వరుసగా కేంద్రమంత్రులతో భేటీ

హైదరాబాద్: ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ బిజీ బిజీగా గడుపుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి పనులు, పెండింగ్ నిధులకు సంబంధించిన విషయాలపై డిస్కస్ చేసేందుకు వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగానే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీ ప్రక్షాళన, మూసీ సుందరీకరణకు సంబంధించిన వివరాలను ఖట్టర్‌కు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఖట్టర్‌తో భేటీకు ముందు కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన తెలంగాణకు వరద సహాయం పెంచి త్వరగా అందించాలని రేవంత్ అమిత్ షాను కోరారు. దీంతో పాటు సుధీర కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు భారత వైమానిక దళ వ్యవస్థాపక దినోత్సవం

భారత వైమానిక దళం (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) ఆవిర్భావమై నేటికి 92సంవత్సరాలు. 1932 అక్టోబరు ఎనిమిదో తేదీన స్థాపితమైన ఐఎఎఫ్.. మొత్తం ఐదు ఆపరేషనల్ కమాండింగ్ కేంద్రాలను కలిగిన ఐఎఎఫ్‌కు 1,130 కంబోట్ 1,700 నాన్ కంబోట్ ఎయిర్‌కాఫ్ట్‌లు ఉన్నాయి. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వాయుసేనగా భారత వైమానిక దళం పేరుగడించింది.

తనకు అవసరమైన సిబ్బందికి అధునాతన శిక్షణ ఇచ్చుకోవడంలోను, అధునాతన యంత్రసామాగ్రిని సమకూర్చుకోవడంలోను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ముందంజలో ఉండటమే కాకుండా.. ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. 1932 అక్టోబరు ఎనిమిదో తేదీన స్థాపితమైనప్పటికీ.. భారత వైమానిక దళంలోకి తొలి ఎయిర్‌క్రాఫ్ట్‌ను 1933 ఏప్రిల్ ఒకటో తేదీన వచ్చి చేరింది. ఆరంభంలో కేవలం ఐదు మంది పైలట్స్, ఒక ఆర్ఏఎఫ్‌ను కలిగివున్నది.

**తొలి ఐదుగురు పైలట్స్ వీరే**

ఇండియన్ ఎయిర్ ఫోర్సుకు తొలి ఐదుగురు పైలట్స్‌గా విధులు నిర్వహించిన ఘనత హరీష్ చంద్ర సిర్కార్, సుబ్రొతో ముఖర్జీ, భూపేంద్ర సింగ్, అజాద్ భక్షా అవాన్, అమర్జీత్ సింగ్‌లు వైమానిక చరిత్ర పుటల్లో నిలిచిపోయారు. ఆ తర్వాత సుబ్రతో ముఖర్జీ తొలి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. తర్వాత రెండో ప్రపంచ యుద్ధానికి ముందు.. అంచలంచెలుగా మరింత మంది సిబ్బందిని ఐఎఎఫ్ నియమించుకుంది.

వీరిలో అస్పీ ఇంజనీర్, కేకె.ముజుందర్, నరేంద్ర, దల్జీత్ సింగ్, హెన్రీ రంగనాథన్, ఆర్‌హెచ్‌డి సింగ్, బాబా మెహర్ సింగ్, ఎస్ఎన్.గోయల్, ప్రిత్‌పాల్ సింగ్, అర్జన్ సింగ్‌లు అగ్రగణ్యులు. వీరు వాయుసేనకు అందించిన సేవలు ప్రశంసనీయం. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో భారత వాయుసేన క్రియాశీలక పాత్రను




పోషించింది. తొలి వైమానిక దళ దాడి అర్కన్ ప్రాంతంలోని జపనీస్ సైనిక స్థావరంపై జరిపింది.

ఈ యుద్ధం తర్వాత ఐఎఎఫ్‌ను అంచలంచెలుగా వృద్ధి చెందింది. యూఎస్‌కు చెందిన వుల్టీ వెంగీయన్స్, బ్రిటీష్ హాకర్ హరీకేన్, వెస్టలాండ్ లైసండర్ వంటి అధునాతన ఎయిర్ క్రాఫ్ట్‌లు ఐఎఫ్‌లో వచ్చి చేరాయి. అంతేకాకుండా.. భరతగడ్డపై పొరుగు దేశాలు దాడికి తెగబడినపుడల్లా భారత వాయుసేన కీలక పాత్ర పోషించింది.

ముఖ్యంగా.. 1960లో ఏర్పడిన కాంగో సంక్షోభ సమయంలోను, 1962లో జరిగి ఇండో-చైనా పోరు సమయంలోను, కాశ్మీర్ కోసం 1965లో పాకిస్తాన్‌తో జరిగి యుద్ధ సమయంలోను, 1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలోను, 1984లో జరిగి ఆపరేషన్ మేఘదూత్‌లోను, 1988లో ఆపరేషన్ కాక్టస్‌లోను, 1999లో జరిగిన ఆపరేషన్ సఫేద్ సాగర్ (కార్గిల్ వార్) సమయాల్లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సేవలు ప్రశంసనీయం.

గడచిన ఎనిమిది దశాబ్దాల్లో మన వైమానిక దళం సాంకేతికంగా ఎంతోఅభివృద్ధి చెందింది. ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉంది. భారత గగన తలంలోకి ఇతర దేశాల విమానాలు చొచ్చుకుని రాకుండా నిరంతరం నిఘా వేస్తోంది. అదే సందర్భంలో దేశంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను రక్షించడానికి, వారికి సహాయం చేయడానికి వైమానికదళం అందిస్తోన్న సేవలు అమోఘం. 92వ వార్షికోత్సవం సందర్భంగా ఈరోజు ఘజియాబాద్ లోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ హిందాన్ లో జరిగే పెరేడ్ లో వైమానిక దళ ప్రధానాధికారి గౌరవ వందనం స్వీకరిస్తారు.

# విశాఖలో కొత్త రకం ట్రాప్...

**విశాఖపట్టణం, అక్టోబరు 7, పెన్ పవర్:** అందమైన రూపం.. ఆకట్టుకొనే అభినయం.. మాటల కవ్వింపులు.. వయ్యారాల పలుకులు.. ఇంకేముంది అదృష్టం తలుపుతట్టింది అనుకుంటున్నారా.. అయితే మీకు చిక్కులు వచ్చినట్లే. మీ పరువుకు భంగం కలిగినట్లే. సోషల్ మీడియా ద్వారా చిలుక పలుకులు పలకడం.. ఆ తర్వాత బ్లాక్ మెయిలింగ్ చేయడం నేటి సమాజంలో పలువురికి ఒక వృత్తిలా మారింది. ఇలా ఎందరినో వలలో వేసుకొని, మోసం చేసిన ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మహిళ బాధితుల లిస్ట్ తీస్తున్న పోలీసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైంది. అందుకే నేరస్తులు సైతం ఇదే మాధ్యమాన్ని వాడుకొని.. ఎందరినో బురిడీ కొట్టిస్తున్నారు. హనీ ట్రాప్ పేరిట జరిగే మోసాలు అయితే రోజురోజుకు అధికమవుతున్నాయి. హనీ ట్రాప్ అంటే ఏమిటో తెలుసా.. సోషల్ మీడియా ద్వారా పరిచయం కావడం.. ఆ తర్వాత వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడం.. మత్తు ప్రయోగించడం.. ప్రవేట్ ఫోటోలు తీసి బ్లాక్ మెయిల్ చేయడం. ఇంతకు ఇలా చేస్తున్నది ఎవరో అనుకొనేరు కొందరు అందమైన యువతులు. అందమైన వారే ఎందుకో తెలుసా.. వెంటనే బురిడీ కొట్టించి లక్షలు దండుకోవడం వీరి వంతు.ఇలాంటి ఘటన జరిగిన నేపథ్యంలో విశాఖ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎన్నో సంచలనమైన కేసులను ఛేధించిన విశాఖ పోలీసులు.. ఈ కేసు అంతు తేల్చేలా పక్కా ప్రణాళికతో దర్యాప్తు చేసి నిందితురాలు జాయ్ జెమిమాను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు షాకుల మీద షాకులు తగిలాయి.హనీ ట్రాప్ పేరిట ఒక ముఠాగా ఏర్పడ్డ దుండగులు.. పథకం ప్రకారం జెమిమాను ఉపయోగించి సోషల్ మీడియా ద్వారా ఎందరినో బురిడీ కొట్టించారు. ముందు పరిచయం.. ఆ తర్వాత మత్తు ఇవ్వడం.. అసభ్యకర వీడియోలు తీయడం.. ఇక బెదిరించడం ఇలా సాగేది ఈ ముఠా పని. అలాగే



సంబంధిత మహిళకు ఎలా బుట్టలో పడవేయాలో ట్రైనింగ్ కూడా ఇచ్చారంటే ఈ ముఠా కథ వేరే అని చెప్పవచ్చు.అయితే ఈ కేసు గురించి విశాఖ సీపీ బాగ్చి మాట్లాడుతూ.. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. వీరి వలలో పడి మోసపోయిన వారు.. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఇదొక ముఠాగా తాము గుర్తించామని, అన్ని ఆధారాలు సేకరిస్తున్నట్లు.. త్వరలోనే మిగిలిన ముఠా సభ్యులను అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. తర్వాత యువకుడికి ఫోన్ చేసి అమెరికా నుంచి విశాఖకు రప్పించింది. ఎయిర్‌పోర్టుకు రాగానే మురళీనగర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి బంధించింది. మత్తు పదార్థాలు కలిపిన జ్యూస్‌లు, డ్రింక్స్ ఇచ్చి పెర్ఫ్యూమ్ స్ప్రే చేస్తూ మైకంలో ఉన్నప్పుడు శారీరకంగా కలిసినట్లు ఫొటోలు తీయించింది.


వాటితో యువకుడిని బ్లాకెమెయిల్ చేసింది. దీంతో బెదిరిపోయిన యువకుడు తన తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పిస్తానని చెప్పాడు. అయినా వినిపించుకోకుండా జెమిమా తన సహచరులతో కలిసి తరచూ బెదిరించేంది. ఇటీవల భీమిలిలోని ఓ హోటల్‌లో బలవంతంగా నిశ్చితార్థం చేసుకుని యువకుడితో రూ.5 లక్షలు ఖర్చు చేయించింది. తర్వాత నిశ్చితార్థం, ఏకాంతంగా ఉన్న ఫొటోలు చూపించి మురళీనగర్‌లోని తన ఇంట్లో నిర్బాంధించింది. పెళ్లి చేసుకోకపోతే.. కేసు పెట్టి అమెరికా వెళ్లకుండా చేస్తానని బెదిరింపులకు పాల్పడింది. డబ్బులు కాజేసింది.ఒక రోజు యువకుడు పారిపోయేందుకు యత్నించాడు. దీంతో సహచరులతో కలిసి కత్తితో బెదిరించి చంపడానికి యత్నించింది. జెమిమాను పెళ్లి చేసుకోకుంటే చంపేస్తామని ఆమె అనుచరులు కూడా బెదిరించారు. అక్టోబర్ 4న బాధితుడు తప్పించుకుని భీమిలి పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు జెమిమాతోపాటు ఆమె అనుచరులను అరెస్టు చేశారు. జెమిమా గతంలో కూడా తన స్నేహితులతో కలిసి ధనవంతులైన అబ్బాయిలను ట్రాప్ చేసి భారీగా డబ్బులు వసూలుచేసినట్లు పోలీసులు తెలిపారు.అలాగే సోషల్ మీడియా వేదికగా జరిగే నేరాల పట్ల యువతీ, యువకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులతో స్నేహం చిక్కులే తెచ్చే పరిస్థితులు ఉన్నాయని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు విశాఖ సీపీ బాగ్చి.

# చంద్రబాబుతో కిరణ్ కుమార్ రెడ్డి భేటీ



**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** ఒకరేమో ప్రస్తుత సీఎం.. మరొకరు మాజీ సీఎం.. వీరిద్దరూ కలిశారు.. మాట్లాడుకున్నారు.. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వీరి భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇంతకు ఏమి మాట్లాడుకున్నారు.. ఏ విషయంపై చర్చించారన్నది మాత్రం బయటకు రాని పరిస్థితి. వీరి కలయిక వెనుక ఏదైనా అంతరార్థం ఉందా అనే ప్రశ్నలు ప్రస్తుతం రాజకీయ చర్చకు దారితీశాయి. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నేతలు బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు సీఎం చంద్రబాబు. అయితే ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో బాబు భేటీ కానున్నారు. ఈ సంధర్భంగా రాజకీయ పరమైన అంశాలపై చర్చ సాగనుండగా.. రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలు కూడా వీరి మధ్య చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పోలవరం అంశంపై చర్చించి.. ప్రాజెక్ట్ పనులు వేగవంతమయ్యేందుకు బాబు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం.ఇలా ఢిల్లీ పర్యటన నిమిత్తం వచ్చిన సీఎం చంద్రబాబును ఏపీకి చెందిన కీలక నేత కలిశారు. ఆయనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. కిరణ్ కుమార్ రెడ్డి గత ఎన్నికల సమయంలో బీజేపీలో చేరారు. ఇక కూటమిలో భాగమైన ఈయనకు పొత్తులో భాగంగా.. రాజంపేట లోక్ సభ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం దక్కింది. కానీ ఇక్కడ వైసీపీ నుండి పోటీ చేసిన మిథున్ రెడ్డి విజయాన్ని అందుకున్నారు. కిరణ్ కుమార్ రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించినప్పటికీ ఓటమిని చవిచూశారు.ఈ తరుణంలో కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీ నేతగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి కలిసినా.. ఢిల్లీకి బాబు పయనం సమయంలో భేటీ కావడం చర్చకు దారి తీసింది. మాజీ ముఖ్యమంత్రి హోదా గల కిరణ్ కుమార్.. బీజేపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాల గురించి చర్చించినట్లు సమాచారం. అలాగే రాష్ట్ర రాజధాని అమరావతి అంశంపై కేంద్రంతో చర్చించాల్సిన అంశాలు.. కూడా వీరి మధ్య చర్చకు వచ్చాయట.రాజధాని నిర్మాణానికి తాను స్వాగతిస్తానని గతంలో కిరణ్ కుమార్ ప్రకటన సైతం జారీ చేశారు. అయితే రాష్ట్ర తాజా రాజకీయ స్థితిగతులపై చర్చించారా.. లేక బీజేపీ పెద్దలతో ఏమి మాట్లాడాలనే అంశంపై చర్చించారో ఏమో కానీ.. వీరి భేటీ మాత్రం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# పవన్ ఫామ్ కోల్పోతారా...



**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ అయిన తర్వాత ఒకింత ఫామ్ కోల్పోతున్నారా? ఏదో చేద్దామని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఏమీ చేయలేక నిరాశ నిస్పృహలో మిగిలిపోయారా? అందుకే సనాతన ధర్మం ముసుగు వేసుకుని తిరుగుతున్నారా? అన్న కామెంట్స్ ఇప్పుడు ఆయన అభిమానులనే కాదు కాపు సామాజికవర్గాన్ని కూడా వేధిస్తున్నాయి. ఎన్నికల ముందు వరకూ పవన్ కల్యాణ్ లో కనిపించని సనాతన ధర్మం ఇప్పుడు ఒక్కసారిగా కనిపించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పవన్ కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ ఘటనలు జరిగాయా? కదా? అన్న ప్రశ్నకు ఆయన నుంచి సమాధానం లేదు.అప్పుడు రామతీర్థంలో రథం తగలపడటం వంటి ఘటనలు జరిగినా పవన్ కల్యాణ్ కు అప్పుడు సనాతన ధర్మం ఎందుకు గుర్తుకు రాలేదని, నాడు ఆ దుస్తులు ఎందుకు ధరించలేదని, ఎందుకు ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టలేకపోయారన్న సందేహాలు ఆయన ఫ్యాన్స్ లో ప్రతి ఒక్కరిలో తలెత్తుతున్నాయి. ఆనాడు గుర్తుకు రాని, పాటించని సనాతన ధర్మాన్ని ఒక్కసారిగా అధికారంలోకి రాగానే ఎందుకు గుర్తుకు వచ్చిందని, విపక్షంలో చేయాల్సిన పనులు అధికారంలో ఉన్నప్పుడు చేయడానికి గల కారణాలు ఏమై ఉంటాయా? అన్న అనుమానాలు అందరిలోనూ ఉన్నాయి. కానీ అందుకు సమాధానం చెప్పాల్సింది పవన్ కల్యాణ్ మాత్రమే. అందుకు కారణాలు కూడా ఆయనకు మాత్రమే తెలిసి ఉంటుందిఒక్కసారిగా పవన్ కల్యాణ్ లో ఈ మార్పు రావడానికి కారణం ఏమై ఉంటుందా? అన్నది అర్థం కాకుండా ఉంది. ఒకవేళ పవన్ కల్యాణ్ ను వెనక నుంచి ఎవరైనా ఇలా చేయమని ప్రోత్సహిస్తున్నారా? అది రాష్ట్ర స్థాయిలో కాకుండా దేశ స్థాయిలో జరుగుతుందా? అన్న సందేహాలు కూడా లేకపోలేదు. ఎందుకంటే ఇప్పటికే సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్ ఈ సనాతన ధర్మం నినాదం అందుకోవడం వెనక బీజేపీ ఉందన్న కామెంట్స్ బాగానే వినపడుతున్నాయి. అయితే అందులో నిజం ఎంతో తెలియదు కానీ, దక్షిణ భారత దేశంలో బలమైన హిందుత్వ వాది తమకు అవసరం కావడంతో అందుకు పవన్ కల్యాణ్ ను వినియోగిస్తున్నారని అంటున్న వారు అనేక మంది ఉన్నారు.కానీ బీజేపీ అలాంటి పని చేయకపోవచ్చు. బీజేపీ సొంతంగానే ఎదుగుతుంది. మరొకరి చేతిలో, మరొక పార్టీ అధినేత చేతిలో హిందుత్వ నినాదాన్ని అప్పగించి తాను తప్పుకునేంత పిచ్చిపనులు చేయదన్నది కూడా మరికొందరి వాదన. కానీ పవన్ కల్యాణ్ మాత్రం సనాతన ధర్మంతో పాటు ప్రాయశ్చిత్త దీక్ష వంటి వాటితో కొన్ని వర్గాలకు దూరమవుతున్నారన్న ఆందోళన కూడా ఆయన అభిమానుల్లో వ్యక్తమవుతుంది. పవన్ ను అభిమానించే వారు ఈ సలహా ఎవరు ఇచ్చారన్న దానిపై ఆరాలు తీయడం మొదలు పెట్టారట. ఇది రాజకీయంగా పవన్ కు నష్టం చేకూరుస్తుందే తప్ప లాభం ఎంత మాత్రం చేకూర్చదన్న బలమైన వాదన మాత్రం వినిపిస్తుంది.

# దేవరగట్టు కర్రల సంబరాలకు సర్వం సిద్ధం



**కర్నూలు, అక్టోబరు 7, పెన్ పవర్:** దసరా పండుగ సందర్భంగా దేవరగట్టు కర్రల సంబరానికి భక్తులు సిద్ధమవుతున్నారు. ఆలూరు నియోజకవర్గం లోని దేవరగట్టులో ప్రత్యేక విజయదశమి పండుగ రోజు మాల మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా జరిగే సంప్రదాయ సమరమే కర్రల సమరం. దీనినే స్థానికంగా బన్నీ ఉత్సవం అని కూడా అంటారు. ఈ ఉత్సవానికి ఆంధ్రతో పాటు తెలంగాణ కర్ణాటక మహారాష్ట్ర నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు. మాల మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లడంలో భక్తులు రెండు వర్గాలుగా విడిపోయి జరుపుకునే ఉత్సవమే సమరమే కర్రల సమరం బన్నీ ఉత్సవం గా పిలుస్తారు. ఈ కర్రల సంబరానికి కొంతమంది మద్యం సేవించి వస్తుండటంతో కర్రలు తిప్ప లేక,.. కర్రల చివర్లో ఉండే ఇనుప చివ్వలు తగిలి తలలు పగులుతున్నాయి. సమరంలో వాడే దివిటీల నుంచి నిప్పు రవ్వలు పడి , తొక్కిసలాటలో కిందపడి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.ఈసారి హింసను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్వయంగా దేవరగట్టును పరిశీలించారు. బందోబస్తును సిద్ధం చేస్తున్నారు. ఈనెల 12న దసరా పండుగ రోజు అర్ధరాత్రి ఈ ఉత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ ఉత్సవానికి బందోబస్తుగా 1000 మందికి పైగా పోలీసులు ఉంటారు. వివిధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఎట్టి పరిస్థితులలో హింసకు తావు లేదని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ చెప్తున్నారు

# రూ.80కి చేరిన టమాటా



**రాజమండ్రి, అక్టోబరు 7, పెన్ పవర్:** టమాటా ధరలు ఒక్కసారిగా సెంచరీ కొట్టేస్తోంది. ఎక్కడ చూసిన 80 రూపాయ కంటే తక్కువకు కిలో టమాటా దొరకడం లేదు. నిన్న మొన్నటి వరకు 50రూపాయల్లోపు ధర పలికే టమాటా ఇప్పుడు ఒక్కసారిగా డబుల్ అయిపోయింది. కొనేందుకు వెళ్తున్న వినియోగదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఉన్న వాటినోత సరిపెట్టుకుంటున్నారు. అసలే పండగ సీజన్ ఆపై ధర పెరిగిపోవడంతో ఏం తినాలని వాపోతున్నారు. టమాటా లేనిదే దాదాపు ఎవరింట్లో కూడా వంట పూర్తి కాదు. వెజ్ ఆర్ నాన్‌వెజ్ ఏం వండినా టమాటా ఉంటే ఆ వంటకానికి అదనపు రుచి వస్తుంది. కుటుంబానికి సరిపడేలా వంటకం పూర్తి అవుతుంది.ఇప్పుడు టమాటో వందకు చేరుకోవడంతో వినియోగదారులు ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. కొందరు చింతపండును వినియోగిస్తుంటే మరికొందరు నిమ్మకాయలతో సరిపెట్టుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో వాతావరణ పరిస్థితులకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడ పండించే పంట పూర్తిగా నాశనమైపోయింది. అక్కడి దిగుబడి పూర్తిగా పడిపోయింది. మధనపల్లిలో పరిస్థితి అంతే ఉంది. ఈ మూడు ప్రాంతాల నుంచి వచ్చే టమాటా ఒక్కసారిగా తగ్గిపోవడంతో పరిస్థితి మారిపోయింది. మొన్నటి వరకు యాభైరూపాయల వరకు ఉండే టమాటా ధరలు ఇప్పుడు ఏకంగా వంద రూపాయలకు చేరాయి. ఇప్పట్లో ఈ ధరలు తగ్గే అవకాశం లేదని తెలుస్తోంది. మదనపల్లె మార్కెట్‌లోనే టమాటా ధర 80 రూపాయలకుపైగా పలుకుతోంది. అంటే మిగతా ప్రాంతాలకు ఆ సరకు వెళ్లే సరికి వంద రూపాయలకు పైమాటే అంటున్నారు. ఉల్లిగడ్డల ధరలు కూడా ఆ స్థాయిలోనే కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి సరిపడా సరకు రాకపోవడంతో ఉల్లి రేటు పెరిగిపోతోంది. అది కూడా క్వాలిటీ ఉండటం లేదన్నది వినియోగదారులు చెబుతున్న మాట.

# ఇంటర్ విద్యలో మార్పులు

**విజయవాడ, అక్టోబరు 7, పెన్ పవర్:** ఏపీ ఇంటర్ విద్యలో మార్పులకు రంగం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త సంస్కరణలను తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఇటీవలే విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూడా ఇదే విషయం చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యలో సమూల మార్పులు ఉంటాయని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా అడుగులు పడే అవకాశం ఉంది.ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలు తీసుకొచ్చే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే కొత్త నిర్ణయాలను అమలు చేయాలని భావిస్తోంది. పరీక్షల విధానంతో పాటు సిలబస్ ను కూడా మార్చేందుకు కసరత్తు జరుగుతోంది. కొత్తగా ఒక్క మార్కు ప్రశ్నలను కూడా తీసుకువచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇటీవలే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఇంటర్మీడియట్ విద్యలో సమూల మార్పులు తీసుకువస్తామని కూడా చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎన్‌సీఈఆర్టీ బుక్స్ ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. అకడమిక్ కేలండర్, సిలబస్, అధ్యాపకుల పని విభజన, పరీక్షల షెడ్యూల్, పేరెంట్-టీచర్ మీటింగ్, అధ్యాపకులకు శిక్షణ, విద్యార్థుల అటెండెన్స్, విద్యార్థుల సామర్థ్యం పెంపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ నేపథ్యంలోనే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏపీ ఇంటర్ విద్యలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. ఆర్ట్సులో కొన్ని సబ్జెక్టులు మినహా పూర్తిగా ఎన్‌సీఈఆర్టీ సిలబస్ ఉంటుందని తెలుస్తోంది. కేవలం సిలబస్ మాత్రమే కాకుండా? పరీక్షల విధానంలో కూడా మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఫస్ట్ ఇయర్ లో ఒక మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇవి 20 వరకు ఉండేలా కసరత్తు జరుగుతోంది. సైన్స్ గ్రూప్ సబ్జెక్టుల్లో కూడా ప్రశ్నల సరళి మారే అవకాశం ఉంది. వచ్చే ఏడాది నుంచి అన్ని సబ్జెక్టుల్లోనూ 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఆర్ట్స్ సబ్జెక్ట్ పరీక్షల్లోనూ మార్పులు ఉండనున్నాయి. ఇందుకు సంబంధించిన త్వరలోనే మరింత క్లారిటీ రానుంది.మరోవైపు ఏపీ ఇంటర్ బోర్డు విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు ఉచిత ఐఐటీ, నీట్ శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుంది. మొదటి విడతలో రాష్ట్రంలోని నాలుగు ముఖ్య పట్టణాల్లో ఈ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటి పరిధిలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే గతంలో ఎంపిక చేసిన కాలేజీల్లో... అక్కడి జూనియర్ లెక్చరర్లు విద్యార్థులకు ఐఐటీ శిక్షణ ఇచ్చేవారు. ఈసారి నారాయణ కాలేజీలకు చెందిన ఐఐటీ, నీట్ సిలబస్ బోధించే సిబ్బందితో ఈ శిక్షణ ఇప్పించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది.మొదటి విడతలో గుంటూరు, కర్నూలు, నెల్లూరు, విశాఖ నగరాల్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఈ నగరాలకు 5 లేదా 10 కి.మీ పరిధిలోని ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు నారాయణ సిబ్బంది ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉచితంగా నీట్, ఐఐటీ శిక్షణ ఇస్తారు. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నిర్ణీత సెంటర్‌లో ఇంటర్ రెగ్యులర్ తరగతులతో పాటు ఐఐటీ, నీట్ శిక్షణను పొందుతారు. ప్రత్యేక కేంద్రాల్లో శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేస్తారు. దీంతో అటెండెన్స్ ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. గతంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఇలాంటి తరహాలో నీట్, ఐఐటీ శిక్షణను ఇంటర్ బోర్డు ఇచ్చింది. ఆసక్తి ఉన్న ప్రభుత్వ లెక్చరర్లతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. అయితే ఈ విధానం అంతగా ఫలితాలు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది శిక్షణ విధానం మార్చారు. ఆసక్తి గల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపికైన వారికి ఐఐటీ, నీట్ శిక్షణను నారాయణ విద్యాసంస్థల సిబ్బంది ఇస్తారు.

# భారత మహిళతో పాకిస్థాన్ క్రికెటర్ వివాహం





**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్తానీ క్రికెటర్ రజా హసన్ వచ్చే ఏడాది భారతీయ మహిళ పూజా బొమన్‌ను వివాహం చేసుకోనున్నారు. వచ్చే ఏడాది వివాహాన్ని నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారు. నివేదికల ప్రకారం జనవరి 2025లో వీరి వివాహం జరగనుంది. ఈ జంట ఇటీవల న్యూయార్క్‌లో నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ ఫోటోలను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో షేర్ చేశాడు. షోయబ్ మాలిక్, హసన్ అలీతో పాటు భారతీయ మహిళలను వివాహం చేసుకున్న పాకిస్తానీ క్రికెటర్ల జాబితాలో హసన్ రాజా చేరాడు.

పెళ్లికి ముందే పూజ ఇస్లాంలోకి మారనుంది. పూజా హిందువు అయినప్పటికీ పెళ్లికి ముందే తన భర్త మతంలోకి మారుతుందని నివేదికలు సూచిస్తున్నాయి. 32 ఏళ్ళ ఈ పాక్ క్రికెటర్ దేశం తరపున ఒక వన్డే, 10 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.వన్డేల్లో ఒక వికెట్.. టీ20ల్లో10 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికే పాకిస్థాన్‌ను విడిచిపెట్టి అమెరికా వెళ్లిన ఈ ఫాస్ట్ బౌలర్.. మా జీవితాల కొత్త ప్రయాణానికి సిద్ధంగా ఉన్నామని తన సోషల్ మీడియాలో రాశాడు.పూజా బోమన్ అనే భారత మహిళా వయస్సు ప్రస్తుతం 32 సంవత్సరాలు. ఆమె ప్రస్తుతం ఆమె యునైటెడ్ స్టేట్స్‌లో నివసిస్తోంది. సానియా మీర్జా,సమియా అర్జూ తర్వాత పాకిస్థాన్ క్రికెటర్ ను పెళ్లి చేసుకోబోతున్న మూడో మహిళా. ఇప్పటికే షోయబ్ మాలిక్.. ఏప్రిల్ 2010లో భారతదేశ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జాను వివాహం చేసుకున్నారు. పాకిస్థాన్ ఆల్ రౌండర్ హసన్ అలీ కూడా సమియా అర్జూ అనే భారతీయ బ్యూటీతో 2019లో వివాహం చేసుకున్నాడు.

# ఇది భారత జట్టు కాదు.. ఐపీఎల్ టీమ్: పాక్ మాజీ క్రికెటర్






**హైదరాబాద్ పెన్ పవర్:** గ్వాలియర్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టీ20లో టీమిండియా ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. తొలుత బంగ్లాదేశ్‌ను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన భారత ఆటగాళ్లు.. అనంతరం లక్ష్యాన్ని 11.5 ఓవర్లలోనే ఛేదించారు. హార్దిక్ పాండ్యా(39 నాటౌట్), సంజూ శాంసన్(29), సూర్యకుమార్ యాదవ్(29)లు బంగ్లాదేశ్ బౌలర్లను ఉతికేస్తూ బండరీల మోత మోగించారు. ఈ గెలుపుపై స్పందించిన పాక్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ భారత యువ జట్టును ఆకాశానికెత్తేశాడు.

ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో పాక్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలై తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. అప్పటి బంగ్లా జట్టు.. ఇప్పటి జట్టు ఒకలా లేవని బసిత్ అలీ పేర్కొన్నాడు. భారత జట్టుకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన బంగ్లా జట్టుపై టెస్టు సిరీస్ ఓడిన పాక్‌ను ఏమనాలో కూడా తెలియడం లేదని వ్యాఖ్యానించాడు.

**భారత జట్టు కాదు.. ఐపీఎల్ టీమ్**

గ్వాలియర్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించింది భారత సీనియర్ జట్టు కాదు.. ఐపీఎల్‌లో ఒక టీమ్. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ వంటి స్టార్ ప్లేయర్లూ ఇక్కడ లేరు. అంతా యువకులే. అయినప్పటికీ, భారత్ బలంగా ఉంది. ఈ టీమ్‌కు తదుపరి మ్యాచ్‌ల్లోనూ బంగ్లా ఏమాత్రం పోటీ ఇవ్వలేదనేది వాస్తవం. ఇక రెండో టీ20లోనూ గెలిచి సిరీస్ కైవసం చేసుకుంటే.. మూడో టీ20లో రిజర్వ్‌బెంచ్ ప్లేయర్లతో బరిలోకి దిగుతారు. అలా చేసినప్పటికీ వారిదే విజయం. బంగ్లా జట్టును చూస్తుంటే సొంతగడ్డపై మమ్మల్ని(పాకిస్థాన్) వైట్‌వాష్ చేసిన జట్టు ఇదేనా? అనిపిస్తోంది. వీరి చేతిలో ఓడిన మా జట్టును ఏమనాలో కూడా తెలియడం లేదు..“ అని బసిత్ అలీ వ్యాఖ్యానించాడు.కాగా, బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టీ20తో యువ పేసర్ మయాంక్ యాదవ్, తెలుగు కుర్రాడు నితీష్ రెడ్డి భారత జట్టు తరుపున అరంగేట్రం చేశారు.

# పరువు పోగొట్టుకున్న పాకిస్థాన్.. ఫ్రీ ఎంట్రీ అయినా ప్రేక్షకులు లేరు




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ క్రికెట్ నానాటికీ దిగజారుతోంది. క్రికెట్ అంటే ఆ దేశం ఆసక్తి చూపించడం లేదు. చిన్న జట్ల మీద విఫలమవ్వడం.. పెద్ద టోర్నీల్లో కనీస ప్రదర్శన చేయలేకపోవడంతో ఇప్పుడు పాకిస్థాన్ క్రికెట్ ను సొంత ఫ్యాన్స్ కూడా పట్టించుకోవట్లేదు. ఇదిలా ఉంటే సొంతగడ్డపై ముల్తాన్ వేదికగా జరుగుతున్న టెస్టులో ఇంగ్లాండ్ పై జరుగుతున్న టెస్టులో ప్రేక్షకులు లేరు.

ముల్తాన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో స్టేడియంలో ప్రేక్షకులు కరువయ్యారు. ఎటు చూసిన ఖాళీ స్టేడియం కనిపిస్తుంది. పట్టుమని పది మంది అయినా వచ్చారా అనే అనుమానం కలుగుతుంది. ఫ్రీ ఎంట్రీ అయ్యేసరికి ఈ మ్యాచ్ లో ఎక్కువ మంది ప్రేక్షకులు వస్తారని భావించినా.. అది జరగలేదు. డ్రింక్స్ విరామం సమయంలో ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ వస్తున్న సమయంలో అతని వెనుక భాగంలో ఒక్కరు కూడా కనబడకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. చూస్తుంటే ఈ మ్యాచ్ ప్రాక్టీస్ మ్యాచ్ ను తలపిస్తుంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేస్తున్న పాకిస్థాన్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తుంది. ఓపెనర్ సైమ్ అయూబ్ విఫలమైనా.. మరో ఓపెనర్ అబ్దుల్ షఫీక్(102), కెప్టెన్ షాన్ మసూద్ (151) సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ రెండో వికెట్ కు 253 పరుగులు జోడించడం విశేషం. ప్రస్తుతం పాకిస్థాన్ 74 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. బాబర్ అజామ్ (20), సౌద్ షకీల్ క్రీజ్ లో ఉన్నారు.

మచ్చలేని పూల చీరలో వాణి కపూర్



# సినిమాల కోసం శరీరాన్ని చూపించడం ఇష్టం లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** సంతోష్ శోభన్ హీరోగా అనీల్ కుమార్ ఆల్ల దర్శకత్వంలో వచ్చిన కళ్యాణం కమనీయం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ ప్రియా భవానీ శంకర్. మొదటి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు దక్కించుకుంది. కోలీవుడ్ లో ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు టాలీవుడ్ నుంచి సైతం ఆఫర్లు దక్కించుకుంటుంది.. కానీ కొన్ని కండిషన్స్ పెడుతున్న కారణంగా ఆఫర్లు వెనక్కి పోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇటీవల బ్లాక్ సినిమాలో నటించింది. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా ఈ అమ్మడు ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. గ్లామర్ పాత్రల్లో నటించే ఆసక్తి చూపించక పోవడం వల్లే టాలీవుడ్ నుంచి వచ్చిన సినిమా ఆఫర్లు ఫైనల్ కాకుండానే క్యాన్సల్ అవుతున్నట్లుగా ఆమె మాటలను బట్టి అర్థం అవుతోంది. హీరోయిన్ గా నటించాలంటే స్కిన్ షో చేయాల్సిందే, గ్లామర్ గా కనిపించాల్సిందే అంటూ వస్తున్న వార్తలను, చెబుతున్న విషయాలపై ఆమె అసహనం వ్యక్తం చేసింది. అసలు శరీరాన్ని, గ్లామర్ ని చూపించి సినిమాలకు ప్రేక్షకులను రప్పించడం ఏంటో అంది. కెరీర్ పరంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను గ్లామర్ పాత్రలో నటించను అంటూ ఖరాకండీగా చెప్పేసింది. అంతే కాకుండా ఈ అమ్మడు ముందు ముందు ఆఫర్లు రాకున్నా స్కిన్ షో కు ఓకే చెప్పను అంది. %ూశ్రీంశీ =ఘుం% – సూపర్‌స్టార్‌పై పెద్ద దర్శకుడి అక్కసు దేనికి? శరీరాన్ని వస్తువుగా భావించను.. ప్రేక్షకులకు ఒక వస్తువుగా నా శరీరాన్ని చూపించాలని అనుకోవడం లేదు. అసలు అలాంటి పాత్రలను నేను అంగీకరించను. ఒక మోస్తరు వరకు సినిమాల్లో అందంగా కనిపించడం ఓకే కానీ ఎక్కువ పరిధి దాటితే మాత్రం అది బాగోదు అన్నట్లుగా తన అభిప్రాయం వ్యక్తం చేసింది. నెగటివ్ రోల్స్ చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. హీరోయిన్ గానే నటించాలి అని నేను ఎప్పుడూ అనుకోవడం లేదు. అంతే కాకుండా నటిగా మంచి గుర్తింపు వచ్చే సినిమాలను నేను ఎప్పుడూ చేసేందుకు ముందు ఉంటాను అంటూ చెప్పుకొచ్చింది. %ూశ్రీంశీ =ఘుం% – టాప్ డైరెక్టర్ నే రంగంలోకి దించిన నయా స్టార్! ఫేమ్ సొంతం చేసుకోవడం కోసం స్కిన్ షో చేయాల్సిన అవసరం లేదు. సినిమాల్లో రాణించడానికి సైతం అందంగా కనిపిస్తే చాలు కానీ ఎక్కువగా స్కిన్ షో చేయాల్సిన అవసరం లేదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. అంతే కాకుండా సోషల్ మీడియాలో ఈమె చాలా అరుదుగా మాత్రమే ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇలాంటి హీరోయిన్స్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీకి వర్కౌట్ కారు అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం హీరోయిన్స్ అంటే ఇలా కూడా ఉంటారా... స్కిన్ షో చేయకుంటే హీరోయిన్ అని ఎలా అంటారు అంటూ కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ప్రియా భవానీ మాత్రం స్కిన్ షో చేసేదే లేదు అంటోంది.

రలతో పాయల్ ప్రేమ వ్యవహారం



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com